పూర్వము సుప్రభాతము వ్రాసిన దూపాటి తిరుమలాచార్య ఉండేవాడు. అతను వేంకటగిరి సంస్థానములో ఉండే పండితుడు. అతడు చాలా వ్రాసాడు. గొప్ప సంస్కృత పండితుడు. 90 ఏండ్లు వచ్చినా నాతో ప్రయాణమై బదరీ వచ్చాడు. 'తిరుమలాచారీ! దేహము చాలా శుష్కించిపోయింది, యింత దూరము నీవు ప్రయాణము చేయగలవా?' అన్నాను. 'స్వామీ! మీరు నావెంట ఉంటుంటే ఎంతకాలమైనా, ఎంతదూరమైనా ప్రయాణము చేస్తాను. నీకు కాకపోతే యింక లోకానికే నేను వ్యర్థమ'న్నాడు.

నీకెగాని కానివాడనైతె లోకమాత
నేను లోకమందు లోకువౌదు లోకమాత

నేను ఎందుకు లోకములో ఉండాలి. నీకు అయినానంటే జగత్తంతా అయినట్టే. ఇంత భక్తిప్రపత్తులతో జీవించినవాడు ఆ తిరుమలాచారి. కాలమంతా స్వామితోనే గడిపాడు. బృందావనం పోతే బృందావనములోకూడ నాతోనే ఉండేవాడు. ఎంత భక్తి అంటే ఆ భక్తికి ప్రమాణము చెప్పటానికి వీలుకాదు. కట్టకడపటికి తన మరణముకూడ అంత సునాయాసముగా లభించింది. 'స్వామీ! ఇక నాపని అయిపోయింది'. 'నీకు ఎట్లా తెలుసు?' అని అడిగాను. 'లోపలున్న మీరే నాకు బోధిస్తున్నారు' అని పోయి స్నానము చేశాడు. జలము తీసుకువచ్చాడు. పాదాలపై పోశాడు. నాలుగు బొట్లు తీర్థము తీసుకున్నాడు. 'స్వామీ! నేను ఇంక పరిపూర్ణుడనైనాను'.

పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణముదచ్యతే।
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే॥

దేహము పూర్ణమైపోయింది. మనస్సు పూర్ణమైపోయింది. ఆత్మ పూర్ణమైపోయింది. ఇంక నీలో చేరిపోతున్నాను' అన్నాడు. అప్పుడే తన ప్రాణములను వదిలాడు. చూచారా! తెలిసి అనుభవించాలి. ఎప్పుడు వస్తుంది తానుతెలుసుకోగలిగాడు. ఎప్పుడు చూచినా 'సాయిమాతా! సాయిమాతా!'. అలాంటి భక్తి కలిగినవారు లోకములో ఎంతమందో ఉంటున్నారు. తెలియకుండా చేసేవారు ఎంతమందో ఉంటున్నారు. ఇలాంటి పరమభక్తులు జగత్తులో ఉండటం వలనే జగత్తంతా దేదీప్యమానముగా వెలుగుతున్నది.

'జగతియందు పుణ్యపురుషులు లేకున్న
జగములెట్లు వెలుగు పగలుగాను'.

శ్రీసత్యాసాయిబాబా
జనవరి 14వ తేదీ 2000 సంవత్సరము దివ్యోపన్యాసమునుండి.

.......................................................................................................................

ప్రేమమయా

అఖిల మానవులకు నానందమొనగూర్చి
రక్షించుచుండుటే దీక్ష నీకు
సన్మార్గమును వీడి చరియించు వారల
బట్టి గాపాడుటే వ్రతము నీకు
బీదసాదలకైన పెనుబాధ దొలగించి
లేమిని బాపుటే ప్రేమ నీకు
నియమనిష్ఠలతోటి నిన్ను గొల్చెడివారి
గాపాడుచుండుటే ఘనత నీకు
ఆశ్రితావనచిత్త దయాసమేత!
పర్తిపురవాస పరమేశ చిద్విలాస!
గావుమా మమ్ము నేవేళ, దేవదేవ!
సకలగుణసాంద్ర నిస్తంద్ర సత్యసాయిచంద్రా!

భక్తిగొల్చెడివారి పాలిటి దైవంబు
సేవించువారల చెఱగు మూట
ఆశ్రిత దీనజనాళి చింతామణి
దర్శించువారి నేత్రాంజనంబు
చింతించువారల సంతతానందంబు
భజియించువారల భాగ్యరాశి
ఆపన్న జనముల కాప్త బాంధవ్యంబు
పూజించువారల పుణ్యఫలము
అనగ బేరొంది నీయండ నలరువారి
నెన్నడును మరువని వాడవన్నమాట;
మరువజాలను మా తండ్రి; మమ్ము బ్రోవు
సకలగుణసాంద్ర నిస్తంద్ర శ్రీసత్యసాయిచంద్రా!

.....................................................................................................

ధ్యానతరంగములు.

సతతము నిన్నెడబాయక
యతులిత సౌఖ్యాబ్ధి నోలలాడెడు నను, నీ
గతి నీమాయకు లో జే
సితివే నీయాటకొఱకు చిన్మయసాయీ।

నా సహజరూపగుణముల
భాసింపగ నీయకడ్డుపడిన అవిద్యా
వాసనలను పెనబడి, స్వవి
కాసము మఱచితిని పూర్తిగను శ్రీసాయీ।

పంచమహాభూతంబుల
పంచీకరణంబుచేత ప్రబలిన దేహం
బంచును దలపోయక, ప్రే
మించియు, జడభావమది మెలగితి సాయీ।

హృదయగ్రంథుల ద్రెంచియు
సదమల జ్ఞానాగ్ని కర్మసంచితబీజా
ళి దహించియు, సంశయ వి
చ్ఛేదము జేసియు నవిద్య చీల్పుము సాయీ।

ఆర్తత, దాస్యత, సఖ్యత
పూర్తిగ జిజ్ఞాసచేత పొదలుచు మఱియున్
భర్తవని ప్రేమభక్తి న
కర్తనుగా నైక్యసిద్ధి గాంచదలచితిన్।

ప్రజ్ఞాన భాస్కరుండవె
యజ్ఞానపు తిమిరములను నణచియు నెదలో
సుజ్ఞానజ్యోతిని స
ర్వజ్ఞా, వెలిగింపు ప్రేమబాంధవసాయీ।

మన సంబంధము నిత్యం
బు ననాదియును అవిస్మృతి మురళీధర, నీ
యనుపమ కారుణ్యంబున
అనిశము భాసింపజేయనగు శ్రీసాయీ।

పూర్వస్మృతి కలుగగనే
నిర్విషయత నీదుచరణ నిహితాత్ముడనై
సర్వసమర్పణ జేసితి
నిర్వాణ సుఖప్రదాయి నీవని సాయీ।

బహుకాలమునుండియు మా
సహవాసముచేసి, విడువ సమకట్టితివే
ఉహుహూ చూతంబని, అరు
లిహమున బెదరించి రభయమిమ్మా సాయీ।

మనసబంధమనాదిది
మనప్రేమంబనుపమంబు, మన యెడబాటున్
కన, పొరబాటే, సత్యం
బనపాయినియైన నన్ను నరయుము సాయీ।

నీవో అఖండచిత్తువు
గావే, నేనో యుపాధిగతమగు చిత్తున్
నీవనుకంపను జూచిన
పోవునుపాధియును, సమతపొసగును సాయీ।

పురుషుండవీవు, నేనో
పరికింపగ నిన్ను బొందు ప్రకృతిని నౌదున్
పురుషప్రకృతుల నైక్యత
కరమనురాగమున గూర్పగానగు సాయీ।

తొమ్మిదికంతలపురమున
ఇమ్ముగ శయనించియుంట ఈజీవుని, వే
దమ్ములు పురుషుండనె, నిన్
సమ్మతి పురుషోత్తమాఖ్య చాటెను సాయీ।

నను నీ కౌగిటజేర్చియు
ఎనలేని సుఖంబు నాకు నీయంగదవే
అనిశము మంగళదాయీ
వనరుహదళనేత్ర, పర్తివాసా సాయీ।

……………………………………………………………………………………………

దాదాపు 40 సంవత్సరములనుండి ఆధ్యాత్మిక విషయ సంగ్రహణమును పూర్వజన్మ సంస్కార ప్రేరితుడనై చేయుచు, జీవితమును గడుపుచుండ, 1950వ సంవత్సరము సెప్టెంబరు 10వ తేదీ శ్రీవెంకటగిరి సంస్థానాధీశ్వరుల విన్నపమాలించి, సదరు సంస్థాధీశులను, తత్పరిసర భక్తులను అనుగ్రహింప దలచి, వెంకటగిరికి విచ్చేసినప్పుడు శ్రీసంస్థానాధిపతుల ఆశ్రితుడగు ఈ వ్యక్తి వారి మూలముననే శ్రీశ్రీశ్రీసత్యసాయీ భగవానుని శ్రీపాదపద్మముల పంచరత్నోపహారమును సమర్పించు భాగ్యమును నోచుకొనగల్గి, శ్రీవారి యవ్యాజానుగ్రహమునకును, దివ్యాకర్షణమునకు పాత్రుడై, తదాదిగ శ్రీభగవానుని జన్మస్థలమగు శ్రీపుట్టపర్తికి శివరాత్రి, నవరాత్రి మహోత్సవములకు బోవుచు, శ్రీభగవానుని సందర్శన, స్పర్శన, శ్రీపాదసేవాది కైంకర్యములచేతను, శ్రీమహావిష్ణురూపమున స్వప్నములో సాక్షాత్కారమిచ్చి, శ్రీతిరుమంత్రోపదేశ మొనర్చుట- ఇత్యాది సంపూర్ణ కృపా సూచకములగు అనుగ్రహ పరంపరలచే క్రమముగ ధన్యజీవిగ మార్చుగనుచుంటిని. పారలౌకిక జీవితమునకు దోహదమిట్లు చేయుటయేగాక, ఇహ జీవితమునను పుత్రవాత్సల్యమున, శ్రీజగన్మాతయగు తానే ఈ వ్యక్తిని తన యపార కరుణకు గుఱిచేసి, అన్నివిధముల కాపాడుచు, తన యద్భుత ప్రదర్శనములలో నిదియొక్కటిగజూపె.

ఈ దాసానదాసుని చతుర్థ పుత్రికకు తీరని కడుపు నొప్పికి శస్త్రచికిత్స వలదనుచు, రక్షనొసగి, పిమ్మట హైదరాబాదుకు భర్తతోగూడ పోయి యుండగా నాబాధ తీవ్రమైన సమయములో నా రెండవ కూతురు సహాయముగ నచ్చటనే యుండునపుడు, శ్రీబాబావారొకనాటి పగలు 11 గంటల సమయమున సనత్‌నగర్‌లో వారున్న యింటికి కారులో వచ్చి, మంచముపై దోమతెరలో నిద్రించు జబ్బు బిడ్డను శ్రీహస్తముతో స్పృశించుచు, భయములేదని ధైర్యమిచ్చి, వెంటనే వెడలిపోవుచుండగా ఇంటికి వచ్చిన శ్రీస్వామివారికి నర్ఘ్యసత్కారము చేయలేకపోతినే యని చింతించుచు, తన కన్నులను నమ్మలేక, 'ఇది కలయా, నిజమా యని వెలుపలికి వచ్చి చూడగా కారుగాని, కారుజాడగాని కానరానందున ఇదంతయు శ్రీస్వామివారి మహిమయే, శ్రీవారి కృపయే అని శ్రీవారికి నమస్కారములర్పించితి'ననియు నా కుమార్తె పిమ్మట నాకు దెల్పెను. ఆ సమయములో శ్రీస్వామివారు పుట్టపర్తిలోనే యుండిరి. తదాదిగ శస్త్రచికిత్సతో నవసరములేకయే కడుపునొప్పి బాధ పూర్తిగా తగ్గిపోయినది. క్రమేణ ఔషధసేవచేతను, శ్రీబాబావారి సంపూర్ణానుగ్రహముచేతను ఆ బిడ్డ పూర్ణారోగ్యము పొందినది. హైదరాబాదు నందలి ఉస్మానియా హాస్పిటలు డాక్టర్లుకూడ ఏ భగవానుని కృపవలననో ఈ బిడ్డకు గండము తప్పిపోయినదని వెల్లడించిరట. ఇట్లాబిడ్డకు ప్రాణబిక్ష నొసంగిన కాపాడిన శ్రీసత్యసాయీశుని అఘటనఘటనా సామర్థ్యమును విన్నవించుట కొఱకీ విషయము నిటజేర్చితిగాని, స్వోత్కర్షమునకుగాదని పదేపదే మనవిచేయుచున్నాను.

## అవతార రహస్యము

ముముక్షువులారా! సోదరభక్తులారా!, నమస్తే,

శ్రీ భగవానుని దివ్యగుణ లీలావైభవములను పరస్పరము సంభాషించుకొనుచు, దివ్యానందాంబుధి నోలలాడుదముగాక!

నిత్యశుద్ధ బుద్ధముక్త సచ్చిదానందస్వరూపుడును, కృపారాశియు, పూర్ణుడునగు ఆ ఏకైక పరమాత్మ నిరాకారుడై మాత్రమే యుండినయెడల, మానవుల స్థితి అగమ్యమై, అంధకారబంధురమై యుండియుండునేమో!

అందులకయ్యే, శ్రీ శివమహిమ్న స్తోత్రకారుడు చెప్పినట్లు, మానవులు తనను సులువుగజేరి, నేత్ర, శ్రోత్ర, వాక్, కరచరణాది సర్వజ్ఞానేంద్రియ, కర్మేంద్రియములతోడను, అంతఃకరణములతోడను, దర్శన, స్పర్శన, పూజా, సేవా కైంకర్య, భజన, స్మరణ, తపోధ్యానాది వివిధ కర్మల నాచరించి, తరించుటకు వీలగునట్లు, శ్రీ భగవానుడు సాకారమును గ్రహించి, ఈ ప్రపంచములో ఆర్చారూపుడై వెలసి భక్తుల ననుగ్రహించును. అంతమాత్రమున తృప్తినందక, మానవాకారముకూడా దాల్చి, మానవులతోడనే కలసిమెలసి తిరుగుచు, వారికి భక్తి, జ్ఞాన, వైరాగ్యముల ప్రబోధించుచు, వారి కష్టసుఖముల పాల్గొని, ఆయా సమయములకు తగిన సలహాలను, సందేశములను, ఉపదేశముల నొసంగుచు, ఫలాపేక్షారహిత కర్మలను మార్గదర్శియై, తా నాచరించి, భక్తులచే నాచరింపజేయుచు, ఆయా భక్తుల చిత్తవృత్తి ననుసరించి, వారివారికి అర్హములైన సాధనామార్గములను బోధించి, అనుష్ఠానపరులనుగ తీర్చిదిద్దుచు శక్తిపాతముననను, (తన శక్తిని ప్రసరింపజేయవలసివచ్చినపుడు ప్రసరింపజేయుచు) శక్తిచాలనమువలనను (భక్తునిలో నిద్రావస్థయందుండెడు శక్తిని మేల్కొల్పి కార్యోన్ముఖమగునట్లు చేయుచును), దృష్టిపాతమునను (తన దివ్యకృపార్ద్రదృష్టి ప్రసారముచేత, భక్తునిలోని సమస్తశక్తులను ఉద్ధరించి, ప్రదీప్తములై ప్రకాశించి లోకసంగ్రహకర్మ కుపయోగపడునట్లు చేయుచు) ఈలాటి అసంఖ్యాకములును, అవాఙ్మానసగోచరములు నగు పరమాద్భుత దివ్యలీలలతో దాగుడుమూతలాడుచు, తన యదార్థ స్వరూపస్వభావములను ఎవ్వరికిని గోచరముకాకుండాజేయుచు, తన దివ్యపాదములే తప్ప అన్యము గతిలేదను, ఏ కోటానుకోట్ల భక్తులకో ఏ ఒక్కనికో తత్త్వతః తన నిజస్వరూప సాక్షాత్కారానుభూతి భాగ్యము లభింపజేయుచు, మిగత భక్తలోకమునంతయు వారివారి అంతఃకరణ నైర్మల్య పరిపాకముననుసరించి, హృదయమున జ్ఞానదీపమును వెల్గించి,

క్రమముగా సంసారసాగరమునుండి ఉద్ధరించుచు, తన సంబంధములైన (ఆత్మ సంబంధములైన) సత్య, అభయ, అహింస, శాంత, ప్రేమ, ఆనంద, అసంగాది దివ్యస్వభావములను, నరునిలో వికసింపజేసి, నారాయణునిగా మార్చుచు, అవిచ్ఛిన్నముగ తన జగన్నాటకమును కొనసాగించు ఆ జగన్నాటకసూత్రధారిని, ఆ లీలామానుషదేహుని గుర్తించి, భజించి తరించుటకు ఎంతటివారికి సాధ్యము! ఎంతటి పూర్వపుణ్య విశేషముండవలెను! సూదంటురాయియే యగుగాక, చాలా సంవత్సరములుగ ఎండ వానలకు గురియై, దట్టముగ త్రుప్పుపట్టియుండిన ఇనుపముక్కను ఆకర్షింపలేదుకదా! అట్టి అనాద్యవిద్యావరణ విక్షేపములాది సంస్కారములతో జడదేహమే తానని సర్వకాలసర్వావస్థలలో దృఢముగా భావించి, రాగద్వేషములతో ఘోరాతిఘోర నిషిద్ధ కార్యములందు పాల్గొనుటకు జంకక, లోకభీతి, పాపభీతి, దైవభీతి యిసుమంతయు లేక పూర్ణ పైశాచిక స్వభావమున సంచరించు మానవుల, లీలామానుషవేషియగు దైవము మాత్రమెట్లు ఆకర్షించి, సంస్కరింపగలడు? అఘటనాఘటన సామర్థ్యమేమాయనని ప్రశ్నింతురేమో? అట్టి ప్రదర్శనమునకు సమయ సందర్భములు వలదా? అన్నివేళలయందు ఆ భగవానుని కదియేనా పని? హిరణ్యాదుల సందర్భమున శ్రీభగవానుడేమి సెలవొసంగియున్నాడో శ్రీభాగవతమును ఒకపరి తిలకింపుడు. 'బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే' అనిగదా శ్రీభగవానుడు సెలవిచ్చియున్నాడు. మఱియు, 'అవజానంతి మాం మూఢాః', మానుషీం తనుమాశ్రితం' మూఢులు (గ్రంథపఠనము చేసియు, కొన్ని పట్టుదలలను విడువలేని  మూర్ఖులు) లీలామానుషవేషముతో తమ మధ్య సంచరించు శ్రీభగవానుని కానలేక, పై వేషమును మాత్రమేచూచి, భ్రమపడుచు, ఆ వేషమునకు వెనుక దివ్యతేజముతో ప్రకాశించు నిత్య శుద్ధ బుద్ధ ముక్త సచ్చిదానంద స్వరూపుని బుద్ధిచే విచారించి, గ్రహించలేక, అజ్ఞాన సంబంధియగు భేదదృష్టిచే భేదబుద్ధిచే తాము చదివిన ప్రాబల్యుల (వేదశాస్త్రముల) లోని వాక్యములను విస్మరించి, సమ్యక్‌విజ్ఞానము, సమ్యక్‌దృష్టి, సమదర్శనాదులు లేక, విపరీతజ్ఞానము, విషమదృష్టి, భేదకల్పనాదులతో తమ సహజబుద్ధిని, సహజస్మృతిని, సహజజ్ఞానమును పొందజాలక, యదార్థమును గ్రహింపనొల్లక, సత్యభగవానుని సందర్శించు భాగ్యము నోచుకొనక, దరిజేరనట్టివారిని ఏ భగవానుడు, ఎన్నడును సంస్కరించలేదనుటకు చారిత్రకసాక్ష్యములే వలసినన్నిగలవు.

ఏదో మాటలసందర్భమున అప్రస్తుత ప్రసంగమేదైన నుండిన క్షంతవ్యుడను, ప్రస్తుతవిచారమునకు మఱలుదము.

అట్టి పురుషోత్తముడు, ఏకైకసత్యము, అర్చారూపమునను, అవతారరూపమునను, సద్గురురూపమునను ఉన్నప్పుడుమాత్రమే సాకారధారియైన ఆ పరమాత్మ పాదములు శరణుజొచ్చగలము. నిరాకారుని శణుజొచ్చుటెట్లు? భావనామాత్రముననా? సామాన్య భక్తులకు ప్రాథమికావస్థలో భావనావస్థ సిద్ధించునా? చంచలమైన మనస్సును కట్టివేయుటకు, ఆలంబనముగ నెద్దియైన నుండవలెనుకదా. నేల విడచి సాముచేయగలమా! ఆధారము వలదా? యోచింపుడు. అందువలననే అనాదిగ ఈ ఆర్షసాంప్రదాయము స్వస్వరూపధ్యానమో, ప్రణవధ్యానమో, మూర్తిధ్యానమో చిత్తైకాగ్రత సాధనకు ఆలంబనములుగ పేర్కొనియున్నాడు. భక్తిశాస్త్రములందేమి, జ్ఞానశాస్త్రములందేమి పైకారణములవలననే శ్రీభగవానుని శ్రీపాదములను శ్రీసద్గురుదేవుని శ్రీపాదములను ముఖ్యముగ పేర్కొని, భవసాగరమున మునిగిపోవు జీవకోట్లు ఉద్ధరణముకొరకు శ్రీభగవానునిచే ప్రసాదింపబడిన నావ అని ఉద్ఘాటించియున్నారు. వింటిరా ఆ శ్రీపాదముల మహిమ ఎట్టిదో!

బ్రహ్మాది సకల దేవతలకును నిత్యపూజ మైనట్టిదియు, శ్రీమహాలక్ష్మికి నిత్యసేవ్యమైనట్టిదియు, బలి శిరంబున భాసిల్లి కాళీయుని ఫణముల తాండవము చేసినట్టిదియు, జడముగా మారిన అహల్యను పునః చైతన్యవంతముగజేయు సామర్థ్యము గలిగినట్టిదియు, అంతరంగభక్తుల హృదయసీమ దృఢముగాపాదుకొనునట్టిదియు, పావనమందాకినీ జన్మకు స్థానభూతమైనట్టిదియు, ముల్లోకములను పునీతము జేయగలిగినట్టిదియు, నైజ ప్రజ్ఞాన భాస్కర ప్రకాశముచేత అవిద్యామోహ గాఢతమస్సును అవలీలగా హరించు సామర్థ్యము గల్గినట్టిదియు, స్వయముగా తెరువబడిన నిర్వాణద్వార మైనట్టిదియు, దివ్యశంఖ చక్ర రేఖాచిహ్నితమైనట్టిదియు, పరిపూర్ణ పశ్చాత్తప్తులైన దురాచారులకు సహితము ఆశ్రయ మిచ్చునట్టిదియును, కేవలము అమృతమయమైనట్టిదియును, అయిన ఆ శ్రీపాద మహిమను, అట్టి చిట్టిపాద మహిమను వర్ణింప నేరికి సాధ్యము!

ఆత్మసోదరులారా! లెండు, కన్నులు విచ్చి ఆ దివ్య శ్రీపాదమును చక్కగ వీక్షింపుడు. ఆ చిట్టిపాదమే మీ గమ్యస్థానమని గ్రహింపుడు. అనన్యగతికులై ఆ చిట్టిపాదమునే చేరుడు. సంపూర్ణ శరణాగతి జేయుడు. ఆ శ్రీపాదముక్రింద జేరి గట్టిగా కట్టుబడుడు. అందే లీనమైపోవుడు. 'నాన్యఃఫంథా విద్యతేయనాయ'. ఇంతకంటే వేరు మార్గము సులభమైనది, సునిశ్చితమైనది, సుకరమైనది ఇంకొక్కటి లేదు. మన పెద్దలందరు నడచిన బాటయే ఇది. శ్రీమద్రామాయణాది గ్రంథముల శరణాగతి తత్త్వమును విపులముగ వ్రాయబడియున్నది. శ్రద్ధాభక్తులతో ఒకసారి విభీషణ శరణాగతి ఘట్టమును పఠింపుడు. ఆత్మోత్తేజము నందగలదు. 'వెదుకబోయిన తీగె విస్మయంబోదవ। పదములు తగులుట భాగ్యంబుగాదె॥' అను నార్యోక్తి మనకు ప్రత్యక్ష నిదర్శనముగనున్నది. మన పూర్వపుణ్యము ఫలించినది. శ్రీభగవానుని దివ్యావతారకాలముననే జన్మనందితిమి. సత్యభగవానుని పాదపద్మ సందర్శనమున కాకర్షింప బడితిమి. సంపూర్ణ శరణాగతినంది తరింతము. సమయమును పోగొట్టుకొనిన పశ్చాత్తాపము నందవలసియుండును. హెచ్చరిక. నమస్తే.

.........................................................................................................